# ఆగమాగం ఓటేస్తే రైతు బతుకు ఆగమే!



# మీ చీకటి పాలన మాకొద్దు

పెద్దపల్లి, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి పాలనలో రైతులు అరిగోస పడ్డారు. సరిపడా కరెంట్ లేక, అస్తవ్యస్తమైన భూ రికార్డులతో ఆగమయ్యారు. పాసుబుక్కుల్లో భూములు తారుమారు కావడంతో తహసీల్ ఆఫీసుల చుట్టూ తిరిగితిరిగి వేసారిపోయారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం 24 గంటల ఫ్రీ కరెంట్ ఇస్తున్నది. భూముల భద్రతకు పటిష్టమైన ధరణి పోర్టల్ తెచ్చింది. అనేక మాడ్యూళ్ల ద్వారా రిజిస్ట్రేషన్, మ్యూటేషన్ తదితర ప్రక్రియలను సులభతరం చేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ నాయకులు ఎవుసానికి 3 గంటల కరెంట్ సాలనీ, ధరణిని బంగాళాఖాతంలో కలుపుతమని ఆగం చేస్తున్నారు. వారి విధానాలను తెలంగాణ రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మమ్మల్ని పరేషాన్ చేస్తున్న కాంగ్రెసోళ్లకు బుద్ధి చెబుతమని ముక్తకంఠంతో తేల్చిచెబుతున్నారు. కాంగ్రెస్ నాయకుల తీరుపై నిర్మోహమాటంగా తమ అభిప్రాయాలను వ్యక్తంచేస్తున్నారు.

## పెద్ద మోటర్లతో ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతయ్



రైతుల వ్యవసాయ బావులకు 10హెచ్‌పీ మోటర్లు పెడితే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు మీద ఎక్కువ లోడ్‌పడి కాలిపోతయ్. తెలంగాణ రైతులు 10హెచ్‌పీ మోటర్ అస్సలే వాడరు. పెద్ద మోటర్ పెడితే పైప్ లైన్లు మార్చాలి. కరెంట్ కూడ బాగా ఖర్చువుతుంది. ఈ కాంగ్రెస్ నిర్ణయం వల్ల రైతన్నకు తీరని నష్టం జరుగుతుంది. కాబట్టి కాంగ్రెసోళ్ళు చెప్పే అబద్ధాలు రైతన్నలు నమ్మవద్దు. 24 గంటల ఉచిత కరెంట్ ఇచ్చే కేసీఆర్‌కే మద్దతూ పలుకుదాం. చేతిగుర్తు పార్టీ నాయకులు మూడు గంటల కరెంట్ రైతన్నలకు చాలనడం తెలివితక్కువతనమే.

**- కందుల నర్సయ్య, మూలసాల, (పెద్దపల్లి)**

## ఏ రైతనా పెద్ద మోటర్ వాడుతడా?

కాంగ్రెసోళ్లు 3గంటల కరంట్ ఇత్తం, రైతులు 10హెచ్‌పీ మోటర్లు పెట్టుకోవాలనడం సిగ్గు చేటు. తెలిసిన రైతెవరైనా గంత పెద్ద మోటర్ వాడుతడా.. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు కరంట్ గోసలు చెప్పేటివి కాదు. రాత్రులు బాయిల కాడికి పోయి ఎంతో ఇబ్బందులు పడ్డం. కరంట్ సక్రమంగా లేక మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయేటియి. కాంగ్రెస్ అంటేనే రైతులకు భయం వేస్తుంది. కేసీఆర్ సీఎం అయినంకనే ఎవుసానికి 24గంటలు



కరంట్ ఉచితంగా ఇచ్చి ఆదుకుంటుండు. ఇది రైతులం ఎట్లా మరిచిపోతం. ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కంటే ఏం మంచిగ జేత్తరని కాంగ్రెస్‌కు ఓటేస్తం. మల్లా సీఎంగా కేసీఆర్ సారే ఉండాలని రైతులం కోరుకుంటున్నం. బీఆర్ఎస్‌కు ఓటేసి కేసీఆర్‌ను సీఎం చేసుకుంటం.

**- మడ్డి శ్రీనివాస్, రైతు, గుంపుల (ఓదెల)**

## ధరణి కావాలి..దళారులద్దు

ధరణి పోర్టల్‌ను ఎత్తివేస్తే మళ్ల దళారులే రాజ్యమేలుతరు. దళారీ వ్యవస్థ మాకొద్దు.. తెలంగాణ ఏర్పడ్డాకనే రైతులు సంతోషంగా ఉంటున్నారు. పట్టాల కోసం ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టు తిరిగేటోళ్లం. ఇప్పుడు 10 నిమిషాల్లో పట్టాలు చేతికందుతున్నయ్. తహసిల్దార్ ఆఫీస్‌లోనే పట్టాలు చేయడంతో ఎక్కువ దూరం పోవాల్సిన అవసరం తప్పింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తీసివేస్తామనడం సరికాదు.



ఇప్పుడు ఎంతో ఈజీగా భూములు రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. కాంగ్రెస్ వస్తే మళ్లా ఆఫీసుల చుట్టు తిరుగుతూ ఉండాలే. మళ్లీ అధికారులకు లంచాలు ఇచ్చుకుంటనే ఉండాలే. అలాంటి కాంగ్రెస్ ప్రభుత్వం మాకొద్దు. బీఆర్ఎస్ ప్రభుత్వమే మళ్లీ గెలువాలె. అప్పుడే రైతులకు ఇంకింతా మంచి జరుగుతుంది.

**- బోయిని శంకర్, రైతు, బొంపల్లి, పెద్దపల్లి మండలం (పెద్దపల్లి కమాన్)**

## ధరణి తీసేస్తే మళ్లీ గోసే



కాంగ్రెస్ ధరణి తీసేస్తమని చెబుతుంది. దీంతో రైతులు మళ్లీ గోసలు పడాల్సి వస్తుంది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు చాలా కష్టాలు చూసినం. అన్నింటికీ ఇబ్బందులే. ఎవుసం చేసుడంటే ఏడుపు వచ్చేది. సీఎం కేసీఆర్ వచ్చిన తర్వాత ధరణి పోర్టల్ తీసుకొచ్చి ఎవరి భూములు వారికి ఉండేటట్లు చూసిండు. రెవెన్యూ కార్యాలయాల చుట్టు ఏళ్ల తరబడి తిరగకుండా ధరణి మంచిగ పని చేస్తుంది. రైతు అంగీకారం లేకుండా ధరణిలో అధికారులు ఏ మార్పు చేసేది లేకుండా ఉంది. ధరణి వచ్చినంకనే భూముల సమస్యలు పోయి రైతులు మంచిగ ఎవుసం చేసుకుంటున్నరు. ధరణియే ఉండాలని రైతులం కోరుకుంటున్నం. కాంగ్రెస్‌ను నమ్మేది లేదు. అయినా ఆ కాంగ్రెస్ వచ్చేది లేదు. సచ్చేది లేదు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే ఓటు వేస్తం. మళ్ల కేసీఆర్ సారే రావాలి.

**- కంకణాల మధుసూదన్‌రెడ్డి, రైతు, ఇందుర్తి (ఓదెల)**

## గెట్ల పంచాయితీలైతయ్



కాంగ్రెస్ ధరణి తీసేస్తమంటే భూముల కాడ గెట్ల పంచాయితీలు షురూ అయితయ్. మళ్లా పాత కాలం నాటి రాతలు వస్తయ్. ఒగల భూమి ఒగలకు రాసి చిచ్చు పెడతరు. కాయితాల మీద ఆఫీసర్లు ఇష్టం వచ్చినట్లు భూమి రికార్డులు రాసుకుని, దళారుల దగ్గరికి పోయేటట్లు జేస్తరు. సర్కార్ సాయం పంటల పెట్టుబడి, రైతు బంధు అందదు. భూముల కాడ లొల్లులైతయ్. కొట్లాటలతో పోలీస్ స్టేషన్లు, కోర్టులు, ఆఫీసుల సుట్టూ తిరుగుడు అయితది. ధరణి వచ్చినప్పటి నుంచి రైతులు నయా పైస ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నరు. కేసీఆర్ సారు ధరణి తెచ్చి రైతుల కష్టాలు తీర్చిండు. కాంగ్రెస్ పాలనలో భూ సమస్యల పరిష్కారం కోసం నెలలు, ఏండ్ల కాలం పట్టేది. రెవెన్యూ ఆఫీసుల సుట్టూ తిరిగి తిరిగి పనికాకపోయేది. అట్లాంటి పాత రోజులు రావద్దు. మళ్లా అప్పటి కష్టాలు కండ్ల ముందు కనబడుతయ్. మాకు రంది లేకుండా భూములు భద్రంగా ఉన్నయ్. మా బతుకుల్లో నిప్పులు పోస్తే ఊకోం. తెలంగాణ వచ్చినంక ఎవుసం మంచిగా సాగుతుంది.

**-కొత్త వెంకటేశం, రైతు, కుమ్మరికుంట(జూలపల్లి)**

## దొయ్య కూడా తడవదు..



3 గంటల కరెంట్‌తో పొలంలోని ఒక దొయ్య కూడ తడవదు. 3 గంటల కరెంట్ అంటే అది అందరికీ ఒకే సారి ఇస్తరు, దీంతో రైతులంతా పొలాలకు నీళ్లు పెట్టేందుకు ఒకే సారి మోటార్ చాల్ చేస్తే ట్రాన్స్‌ఫార్మర్లు పేలి పోతయ్, మోటార్లు కాలి పోతయ్. కరెంట్ సబ్ స్టేషన్ల మీద కూడా అధిక లోడ్ పడి ఇండ్లలోకి వచ్చే కరెంట్ కూడా ముంపు ఉట్టది. 24 గంటల కరెంట్‌తో మా గోసలు తీరినయ్. భార్య, పిల్లలతో సుఖంగా ఇంటికాడ పడుకుంటున్నాం. కాంగ్రెసోళ్లు మాట్లాడే మాటలన్నీ అబద్ధాలు. ఎనకట కాంగ్రెస్ సర్కారు ఉన్నప్పుడు రైతులంతా ఎంత తిప్పలు పడ్డమో గుర్తుంచుకోవాలి. కరెంట్ కోసం ఎనకట బాయిల కాడి కోసం కండ్లళ్ల వత్తులేసుకొని కరెంట్ కోసం కావలి కాసేటోళ్లం. కరెంట్ నాణ్యంగా ఇచ్చేటోళ్ల కాళ్లళ్ల కట్టెలు పెట్టడం మంచి పద్ధతి కాదు. రైతు గురించి తెలిసినోడు కాబట్టే కేసీఆర్ రైతులకు 24 గంటల కరెంట్‌ను అందిస్తున్నాడు.

**-కోట సమ్మయ్య, రైతు, ఆరెంద, మంథని రూరల్.**

## 3 గంటల కరెంట్‌తో మళ్లీ పాత కథనే..



గతంల ఆరేడు గంటల కరెంట్ ఇత్తేనే రైతులు నానా ఇబ్బందులు పడ్డారు. ఊర్కే బోర్లు, మోటార్లు కాలిపోవుడు, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోయేది. రిపేర్ల కోసం అష్టకష్టాలు పడేది. ఇంక 3 గంటల కరెంట్ మాత్రమే రైతుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటది. రైతులకు సరిపడా నాణ్యమైన విద్యుత్ ఇవ్వక పోతే ఇటు పంట దిగుబడి రాదు.. అటు పంట మంచిగా పండదు. దీంతో రైతు అనేక వ్యయ ప్రయాసాలకోర్చి కూడా ఆర్థికంగా దెబ్బతినే పరిస్థితులుంటాయి. ప్రతీ రైతుకు సరిపడా విద్యుత్ ఉంటేనే ఎవుసాన్ని ఓ పండుగలా చేసుకునేందుకు వీలుంటుంది. 3 గంటల కరెంట్ మాత్రమే సరిపోతది అంటే అన్నోళ్లకు ఏవుసం అంటేనే తెలువదని నేను అనుకుంటున్నా.

**- సిలివేరి లింగయ్య, సీతంపల్లి గ్రామం, ముత్తారం మండలం (మంథని)**

## పైరవీకారులు మళ్లా మొపైతరు..

మాది పెద్దపల్లి మండలం కనగర్తి, నాకు నాలుగెకరాల భూమి ఉన్నది. ధరణి పోర్టల్ తీసేయాలని కాంగ్రెస్ నాయకులు అనడం సరికాదు. ఈ పోర్టల్ వచ్చినంకనే భూములకు రక్షణ వచ్చింది. గతంలో అధికారులు ఇష్టం వచ్చినట్లు లంచం తీసుకుని భూములను ఒకరి పేరు నుంచి మరొకరి పేరుకు



మార్చేవాళ్లు. ఇప్పుడు అలాంటిది ఏమీ లేదు. ఒకసారి భూమి రైతు పేరు ఉన్నదంటే ఎవరు మార్చలేరు. ధరణి వల్ల రైతులకు చాలా మేలు జరుగుతుంది. పట్టాదారు పాస్ పుస్తకాలు రావాలంటే చాలా ఏళ్లు పట్టేవి. అప్పుడు ఏళ్ల తరబడి ఆఫీసుల చుట్టు తిరిగేవాళ్లం. ఇప్పుడు ఇంటికే పట్టాదారు పాస్ పుస్తకాలు వస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రవేశ పెట్టిన ధరణితో రైతులందరికి ఎంతో మేలు జరిగింది. ధరణిని తీసేస్తే పైరవీకారులు మళ్లా మొపైతరు. అప్పుడు రైతులు ఆగం కావాల్సి వత్తది..

**- బందరి అంజయ్య, రైతు, కనగర్తి (పెద్దపల్లి మండలం)**